క్లుప్తంగా

అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న టీజేఎస్ నాయకులు

మల్లాపూర్: ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్కా కమలాకర్ అన్నారు. సోమవారం మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తరచుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తు ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల పలు గ్రామశివారుల్లోని ఈత వనాలు ప్రమాదవశాత్తు దగ్ధమవడంతో గీతకార్మికులు జీవనోపాధిని కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో టీజేఎస్ నాయకులు పాల్గొన్నారు.

గోవిందారం రోడ్డు పనులు ప్రారంభించాలి


వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: మేడిపెల్లి నుంచి గోవిందారం వరకు త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాలని జగిత్యాలలో ప్రజావాణిలో సోమవారం బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. మేడిపెల్లి–గోవిందారం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ. 20 కోట్లు మంజూరు చేసిందని, పనులకు టెండర్ పూర్తయినా అధికారులు పనులు ప్రారంభించడం లేదని పేర్కొన్నారు. పనులు చేయించని అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కో కన్వీనర్ క్యాతం దశరథంరెడ్డి, జిల్లా కార్యదర్శి కరండ్ల మధుకర్, మకిలి ఇస్రాయిల్, ఎంపీటీసీ మేకల రాజు, నాయకులు గణేశ్, జగన్‌రెడ్డి, ఎస్ ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు డీఎస్పీ నాయకుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రతీ పౌరుడికి ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కథలాపూర్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రతీ పౌరుడికి రాజ్యాంగం పుస్తకం అందిస్తే వారికి రాజ్యాంగంపై అవగాహన ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మండల కన్వీనర్ పొడేటి రమేశ్, ప్రతినిధులు పొడేటి రాజేందర్, లింగంపెల్లి సతీశ్,విష్ణు,తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో జెడ్పీచైర్‌పర్సన్ పూజలు


పూజలు చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్ గంగమ్మతల్లి ఆలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన శివుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏల్ల గంగనర్సు, నాయకులు చెట్‌పల్లి సత్తన్న, బాలె చందు, శేఖర్, వెంకటేశ్, వేణు, శ్రీను, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

పెగ్గెర్లలో ఆరోగ్యసర్వే

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో కరీంనగర్‌కు చెందిన చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ఆరోగ్య సర్వే చేపట్టారు. వైద్యులు, వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి ప్రజలకు ఆరోగ్యపరీక్షలు చేసి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులపాటు గ్రామంలో ఆరోగ్య సర్వే చేస్తామని పేర్కొన్నారు. సర్వేలో సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ బాదినేని రమేశ్, నాయకులు ఏజీబీ మహేందర్, ప్రభురాజ్ ప్రవీణ్‌కుమార్, రాచర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టి.. పంటలకు పుష్టి

- ఉపాధిహామీలో చెరువుల్లో జోరుగా పూడికతీత పనులు
- పొలాల్లో పోయించుకుంటున్న అన్నదాతలు
- ట్రాక్టర్ ఖర్చులు ప్రభుత్వం భరించాలంటున్న రైతులు


భూషణరావుపేట తుమ్మల చెరువులో మట్టిని ట్రాక్టర్‌లో పోస్తున్న ఉపాధి కూలీలు

కథలాపూర్: ఉపాధిహామీ పథకం కూలీలకే కాదు.. రైతులకు మేలు చేస్తోంది. పంటల సాగులో అడ్డగోలుగా రసాయనిక ఎరువులు వినియోగం పెరిగి భూసారం క్షీణిస్తోంది. భవిష్యత్తులో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారుతుందనే భయం ఉంది. అనుకున్న దిగుబడి రాకపోగా పెట్టుబడి పెరిగి రైతులు ఆర్థికంగా నష్టాలపాలవుతున్నారు. ఈ క్రమంలో రైతులు సేంద్రియ ఎరువుల ప్రాధాన్యం గుర్తించి చెరువుల్లోని మట్టిని తమ పంట పొలాలకు తరలించుకుంటున్నారు. చెరువుల్లో పూడికతీత పనులు ఉపాధిహామీలో కూలీలతో చేయిస్తున్నారు. కూలీలు తీసిన మట్టిని ట్రాక్టర్లలో రైతులు పంట పొలాలకు తీసుకెళ్తున్నారు. పొలాలు విలువైన పోషకాలతో కూడి సారవంతమవుతున్నాయి. ఈ మట్టిని పొలాల్లో వేసుకోవడంతో సేంద్రియ ఎరువుగా పనిచేసి భూసారం పెరిగి పంటల దిగుబడి పెరుగుతుంది. అంతేకాకుండా రసాయనిక ఎరువుల వాడకం తగ్గడంతో రైతులకు ఖర్చు తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మండలంలో 8 చెరువుల్లో పూడికతీత పనులు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా... ఈ వేసవిలో 6 గ్రామాల్లోని 8 చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలోని చింతకుంట, పెగ్గెర్ల, రాజారాం తండా, ఊట్‌పెల్లి, అంబారిపేట, భూషణరావుపేట గ్రామాల్లోని చెరువుల్లో ఉపాధిహామీలో పూడికతీత పనులు చేపడుతున్నారు. ఉపాధి కూలీలు చెరువుల్లోని మట్టిని తీసి ట్రాక్టర్‌లో పోస్తుండగా.. రైతులు సొంత ఖర్చులతో ట్రాక్టర్‌లో మట్టిని పంటపొలాలకు తీసుకెళ్తున్నారు. గతంలో చెరువులోని మట్టిని ప్రభుత్వమే ఉచితంగా ట్రాక్టర్‌లో సరఫరా చేసేదని రైతులు పేర్కొంటున్నారు.

చెరువుల మట్టితో ప్రయోజనాలు..

చెరువు మట్టితో పంట పొలాలు సారవంతమవుతాయి. పోటాషియం, జింక్, నత్రజని, భాస్వరం, బోరాన్ వంటి పోషకాలు పెరుగుతాయి. పంటలో తేమశాతం పెరగడంతో నీటి వినియోగం తగ్గుతుంది. చెరువు మట్టి వేసుకున్న పంట భూముల్లో క్రిమిసంహారక మందుల వాడకం ఎకరానికి రూ. 3 వేల పెట్టుబడి తగ్గుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

పంటలకు మేలు



చెరువుల్లోని పూడికతీత మట్టి పంటలకు ఎంతో మేలు చేస్తుంది. సేంద్రియ ఎరువుగా పనిచేస్తుంది. ఉపాధిహామీ పథకంలో చెరువుల్లో కూలీలలో పూడికతీత పనులు చేయిస్తున్నారు. కాగా చెరువుల నుంచి రైతుల పంటపొలాల వరకు ట్రాక్టర్లతో ప్రభుత్వం పూడికతీత మట్టిని ఉచితంగా సరఫరా చేయాలి. రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది.

– పుర్కుటపు శ్రీనివాస్‌రెడ్డి, రైతు

భూసారం పెరుగుతుంది



చెరువు మట్టిని పంట పొలాలకు వాడుకోవడంతో భూమి సారవంతమవుతుంది. అధిక దిగుబడి వచ్చేందుకు దోహదపడుతుంది. పంటలకు కావాల్సిన పోషకాలు నత్రజని, భాస్వరం, పోటాషియం వంటి మూలకాలు సమృద్ధిగా పెరుగుతాయి. తొలకరి వర్షం కురిసేలోగానే రైతులు తమ పంట పొలాలకు చెరువు మట్టిని తరలించుకోవాలి.

– యోగితా, మండల వ్యవసాయ అధికారి, కథలాపూర్

రైతులు ఖర్చు భరించాలి



ఉపాధిహామీ కూలీలతో చెరువుల్లోని మట్టిని తవ్వించి ట్రాక్టర్‌లో పోయిస్తాం. చెరువుల నుంచి పంట పొలాలకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లేందుకు ఖర్చును రైతులే భరించాలి. పూడికతీత మట్టి పంట పొలాలకు మేలు చేస్తాయి. ఆసక్తిగల రైతులు ట్రాక్టర్‌లో మట్టిని తీసుకెళ్లి వినియోగించుకోవాలి.

– రాజేందర్, ఉపాధిహామీ ఏపీవో, కథలాపూర్

‘అవి ఆధారం లేని ఆరోపణలు’


వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కోరుట్ల రూరల్: మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌కు గ్రామానికి చెందిన అధికార పార్టీ కార్యకర్త సీపీఐ నాయకులపై ఆదివారం చేసిన ఆరోపణలు సరికాదని ఆ పార్టీ నాయకులు సుతారి రాములు, వెన్న సురేశ్, ఎన్నం రాధ, చెన్నా విశ్వనాథం అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సి. ప్రభాకర్ భవన్‌లో మాట్లాడారు. దళితుల భూముల్లో ఎలాంటి కార్యకలాపాలు చేయలేదన్నారు. పేదలను తప్పుదోవ పట్టించేదుకే ఇలాంటి ఆరోపణలని పేర్కొన్నారు. గ్రామాల్లో భూములు ఆక్రమణకు గురవుతున్న క్రమంలో సీఎం కేసీఆర్ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆక్రమణ భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని పార్టీ పక్షాన కోరామన్నారు. జంబిగద్దె ప్రాంతంలో సీపీఐ ఎం చేస్తున్న ఇళ్ల స్థలాల పోరాటానికి సీపీఐ మద్దతు తెలిపింది తప్పా.. డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని లేని పక్షంలో క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం యెఖీన్‌పూర్ శివారులో సర్వే నెంబర్ 1145,443,444,445 లో పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని ఆర్డీవో కార్యాలయంలో మహిళలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు తెలిపేందుకే పర్యటన


వృద్ధురాలితో మాట్లాడుతున్న సంజయ్

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించటం కోసమే మన ఇంటికి మన సంజయ్ కార్యక్రమాన్ని చేపట్టామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 20వ వార్డులో పర్యటించి పథకాలు వివరించటంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, స్థానిక కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

గొల్లపల్లి: ప్రభుత్వం గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌కు తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్, కారోబార్స్, బిల్‌కలెక్టర్స్, వాటర్‌మెన్స్, డ్రైవర్స్ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్‌ను వేతనంగా చెల్లించాలన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సారంగాపూర్: గ్రామపంచాయతీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన దశల వారి ఉద్యమంలో భాగంగా సోమవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలకు వినతిపత్రాలను అందజేశారు. కారోబార్లు, బిల్‌కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్, డ్రైవర్లతో పాటు, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది పోస్టులను రెగ్యులర్ చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వీటితో పాటు పలు డిమాండ్లతో ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఉత్సవాలపై వివిధ శాఖల సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం జరిపారు. జూన్ 2 నుంచి 22 తేదీ వరకు ప్రత్యేకంగా ఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇందులో ఆర్డీవో వినోద్‌కుమార్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి,అధికారులు పాల్గొన్నారు.

కథలాపూర్: వచ్చే నెల 2 నుంచి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి విజయవంతం చేయాలని కోరుట్ల డీఎల్పీవో శంకర్ కోరారు. సోమవారంఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ ఉమాదేవి, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెల్గటూర్: తెలంగాణ కీర్తిని చాటేలా దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అందరి సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మల్యాల: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అధికారులు, ప్రజలను ఇందులో భాగస్వాములను చేయాలని ఎంపీడీవో వెంకటేశం అన్నారు. సోమవారం మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాంమోహన్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, పొన్నం మల్లేశం, పాక్స్ చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. సోమవారం మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ, ఎంపీడీవో ప్రభు,వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

రాయికల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ ఖయ్యూం పాల్గొన్నారు.

కథలాపూర్: వచ్చే నెల 2 నుంచితెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ జవ్వాజి రేవతి కోరారు. సోమవారం ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీ అంజనేయులు, ఏఎంసీ వైస్‌చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ధర్మపురి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,పాల్గొన్నారు.

మల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎస్సై నవీన్, ఎంపీవో జగదీశ్, అధికారులు, పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

రాయికల్: పట్టణంలోని ఐదుగురికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో రూ.1.80 లక్షల విలువ గల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరు కాగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మోర హన్మండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘మిల్లర్ల అక్రమాలను అరికట్టాలి’

పెగడపల్లి: రైతులను దోచుకుంటున్న మిల్లర్ల అక్రమాలను అరికట్టాలని సామాజిక కార్యకర్త మోతె నరేశ్ అధికారులను డిమాండ్ చేశారు. ధర్మపురి నియోజకవర్గం అంబారుపేట నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర సోమవారం పెగడపల్లికి చేరుకుంది. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి అక్కడ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తూకం చేసి మిల్లర్లకు పంపించినా ధాన్యంలో కోతలు పెట్టి రైతులకు నష్టం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత జిల్లా అధికారులు మిల్లర్లపై చర్యలు తీసుకుని ధాన్యంలో కోతలు లేకుండా చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఆదర్శ రైతు సంఘ భవన పనులకు శంకుస్థాపన


సర్పంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మల్యాల: మండల కేంద్రంలోని ఆదర్శ రైతు సంఘ భవనం నిర్మాణ పనులకు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్ భూమిపూజ చేశారు. స్థానిక తూర్పువాడలోని సంఘ భవనంలో బోరింగ్, ఫ్లోరింగ్, కాంపౌండ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని కోరారు. అనంతరం సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, ఎంపీటీసీ రవళిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు సంగ నారాయణ, కోశాధికారి సంగ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆసం శివకుమార్, రైతుబంధు మండలాధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి రాజమల్లు, సంఘ సభ్యులు జక్కుల రాయమల్లు, సంగ శ్రీనివాస్, సంగ మల్లేశ్, నక్క పర్శరాం, గడ్డి రాములు, ముదాం రెడ్డి, కొడారి రెడ్డి, దత్తసాయి ఆలయ కమిటీ చైర్మన్ సంగ మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అధికారి ఒక్కరే..



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏపీఎంవో శ్రీనివాస్ అనే అధికారి ఒక్కరే హాజరయ్యారు. మిగతా మండల స్థాయి అధికారులు ఎవ్వరూ కూడా హాజరుకాలేరు. దీంతో ప్రజావాణి వెలవెల బోయింది.

పట్టణంలో పోలీసుల పికెట్



కోరుట్ల రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు సోమవారం పికెట్ ఏర్పాటు చేశారు. పట్టణ శివారులోని సంగెం రోడ్డు జంబి గద్దె ప్రాంతంలో ఇళ్ల స్థలాల కోసం ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించటం, ఆర్డీవో ఆఫీస్ ముట్టడితో పాటు 26 మందిని అరెస్టు చేసిన నేపథ్యంలో పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మెయిన్ రోడులోని నంది చౌరస్తా, కొత్త బస్టాండ్, కాల్వగడ్డ, సంగెం రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. టౌన్‌లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని కథలాపూర్, మేడిపెల్లి, మెట్‌పల్లి పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై సతీశ్ కుమార్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని వైష్ణవి కుటుంబ సభ్యులకు అందజేశారు.

చెన్నకేశవనాథ ఆలయ అభివృద్ధి కమిటీ

అధ్యక్షుడిగా సదాశివ రెడ్డి


సదాశివరెడ్డి

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా తుమ్మల సదాశివ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గంప ఆనందం, కోశాధికారిగా చౌడారపు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా చెంగలి గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా కడకుంట్ల నరేశ్, సభ్యులుగా ఎలిగేటి అనిల్, మ్యాకల రమేశ్, మచ్చ గంగాధర్, చింత శివకుమార్, గరిపెల్లి శ్రీనివాస్, చంద వెంకటేశ్వర్లు సోమవారం నియామకమయ్యారు.

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మెట్‌పల్లి: మండలంలోని రామారావుపల్లెలో సోమవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో నిర్మించిన ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాల్గొని మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారమందిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ లక్ష్మి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్‌లో ప్రతిభ చూపించిన అంకం రవి

గొల్లపల్లి: ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస వ్యక్తిత్వ వికాస నైపుణ్యంలో గొల్లపల్లి మండలానికి చెందిన అంకం రవి ఉత్తమ ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్, ప్రశంసాపత్రం అందుకున్నారు. నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వర్‌రావు శిక్షణ ఇవ్వగా అత్యున్నత ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు కరీంనగర్‌లో తారక హోటల్‌లో పురస్కారం అందుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన కండ్లె శ్రవణ్ కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, సోమవారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి రమేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఎట్టెం నర్సయ్య, అలుగునూరి సతీష్, గౌరు తిరుపతి, పులి ఎల్లయ్య, మధు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

జగిత్యాలరూరల్: రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందజేయనున్నట్లు కల్లెడ సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు అన్నారు. సోమవారం కల్లెడ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంట వేసే ముందు భూసారం పెంచేందుకు జనుము, జీలుగ ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వర్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై నేడు సమావేశం

పెగడపల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శోభ అధ్యక్షతన ఉదయం 11 గంటలకుసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీవో మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు,అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నీరజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2 నుంచి 22 వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లపై చర్చిస్తామని తెలిపారు.